andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.8 । కనిష్ఠం 23.9
నిర్మల్
జిల్లా వార్తలు
8
సోమవారం 14 అక్టోబరు 2024



పీపీఎల్ విజేత రేయిన్‌బో వారియర్స్

పెంబి, అక్టోబరు 13 : పది రోజుల నుంచి నడుస్తున్న పెంబి ప్రీమియర్ లీగ్ క్రికెట్ విజేతగా రేయిన్‌బో వారియర్స్ నిలిచింది. ఈ లీగ్‌లో పదిజట్లు పాల్గొనగా విజేతగా రేయిన్‌బో వారియర్స్, రన్నర్‌గా పెంబి ప్రీమియం స్ట్రైకర్‌గా నిలిచారు. ఇందులో విజేతకు రూ. 20,000ల ప్రైజ్‌మనీ, రన్నర్‌కు రూ.10,000ల ప్రైజ్ మనీ నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వా హకులు నరేష్, మహేష్, మతిన్, ఇస్మాయిల్, గణేష్ షారుఖ్, రామ్, అశోక్, చిట్టి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సల్ల స్వప్నిల్ రెడ్డి, తులాల శంకర్, విలాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి అందాలకు నిలయం.. కవ్వాల్



● కవ్వాల్ అభయారణ్యంలో రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన చెట్లు



● కడెం ప్రాజెక్టులో బోటింగ్



● వలస పక్షులు



● కెమెరాకు చిక్కిన వన్యప్రాణులు(ఫైల్)

- దారి వెంట కనువిందు చేసే దట్టమైన అభయారణ్యం అడవులు
- నిండుకుండలా కనిపించే కడెం ప్రాజెక్టులో పర్యాటకుల జలవిహారం
- శీతాకాలంలో విదేశాల నుంచి తరలివస్తూ.. సందడి చేస్తున్న వలస పక్షులు
- పర్యాటకులను మరింత ఆకర్షించేందుకు అడవుల్లో అభివృద్ధి పనులు

నిర్మల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): దారి వెంబడి దట్టమైన అడవులు.. ఆ అడవుల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్డుపై అటూ.. ఇటూ.. దాటుతూ చెంగుచెంగున ఎగిరే కుందేళ్లు, జింకలు, చుక్కల దుప్పులు, నీలు గాయిలు, అడవి బర్రెలు, కొండ గొర్రెలు లాంటి ఎన్నో రకాల వన్యప్రాణులు ఆ పచ్చని చెట్లపై కిలకిల రావాలు పలికే పలు రకాల పక్షులు, అక్కడక్కడ జలజల పారే జలపాతాలు ఇలా ఎన్నో ప్రకృతి అందాలకు కవ్వాల్ అభయారణ్యం నిలయంగా మారింది. కవ్వాల్ అభయారణ్యం అందాలను తిలకించేందుకు రాష్ట్రంలోని పలు సుదూర ప్రాంతాల నుంచి సైతం పర్యాటకులు తరలివస్తూ.. ప్రకృతి ప్రతిరూపాలను చూసి మంత్రముగ్ధులవుతున్నారు. అభయారణ్య అందాలకు తోడు కవ్వాల్ అభయారణ్యం పరిధిలోనే ఉన్న మరో సుందర ప్రదేశం కడెం ప్రాజెక్టు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నిండుకుండలా మారిన కడెం ప్రాజెక్టులో జలవిహారం చేసేందుకు జనం మక్కువ చూపుతుండడంతో ఈ ప్రాంతానికి సందర్శకుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది.

అభయారణ్యానికి పర్యాటక శోభ

దట్టమైన అడవులకు నిలయమైన కవ్వాల్ అభయారణ్యంలో పెద్దపులుల సంరక్షణ కోసం చేపట్టిన చర్యలతో శాఖాహార జంతువుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇటీవల కాలంలో కవ్వాల్ అభయారణ్యం మీదుగా ప్రయాణించే వాహనదారులకు ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్డుపై అటూ.. ఇటూ.. దాటుతూ కనిపించే వన్యప్రాణులు సందడి చేస్తున్నాయి. అంతేకాకుండా అభయారణ్య ప్రాంతంలో సైతం ఏకో టూరిజం పేరిట పర్యాటక ప్రదేశాలను పెంపొందిస్తున్నారు. ఇందులో భాగంగా అటవీ ప్రాంతంలో సఫారీ ట్రాక్‌లు, ఎత్తైన వాచ్ టవర్లు, గ్రాస్ ల్యాండ్స్ లాంటి ఎన్నో అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నారు. ఇటీవల పునరావాసం కోసం తరలించిన కడెం మండలం ఉడుంపూర్ రేంజ్ పరిధిలోని మైసంపేట్, రాంపూర్ ప్రాంతాల్లో సైతం 50 హెక్టార్లలో గ్రాస్ ప్లాంట్లు, 2.5 హెక్టార్లలో ప్లాంటేషన్ పనులను ప్రారంభించారు. అదే విధంగా కడెం రేంజ్ పరిధిలో వాచ్ టవర్‌తో పాటు 15 కిలో మీటర్ల మేరకు సఫారీ ట్రాక్‌ను నిర్మాణం చేశారు. ఈ ప్రాంతానికి ఇంకా సఫారీ వాహనాలను కేటాయించలేదు. ఉడుంపూర్ రేంజ్ పరిధిలో నిర్మించిన సఫారీ ట్రాక్ మీదుగా ప్రస్తుతం పర్యాటకులకు అనుమతించకపోయిన డిపార్ట్‌మెంట్ పరంగా సఫారీ వాహనాలను ఉపయో గిస్తున్నారు. ఈ ప్రాంతం అడవుల్లో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయితే ఈ ప్రాంతానికి మరింత పర్యాటక శోభ సంతరించనుందని స్థానిక అటవీ అధికారులు చెబుతున్నారు.

శీతాకాలపు నేస్తాలు..

కవ్వాల్ అభయారణ్యంలోకి శీతాకాలం వచ్చిందంటే ఎన్నో రకాల పక్షులు నైజీరియా లాంటి దేశాల నుంచి వలస వస్తున్నాయని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా ఈ ప్రాంతం పరిధిలోని కడెం మండలం ఉడుంపూర్ రేంజ్ పరిధిలో గల కల్హ కుంటతో పాటు ఇతరాత్ర కుంటలు, చెరువులలో సదరు పక్షుల సంతతిని వృద్ధి చేసేందుకు అనువైన వాతావరణం ఉంటుందని అందుకోసం లక్షల మైళ్ల దూరం ప్రయాణించి పక్షులు ఇక్కడికి చేరుకుంటాయని చెబుతు న్నారు. ఇక్కడి దట్టమైన పొదలలో ఆవాసం ఏర్పరచుకొని చెరువులు, కుంటలలో నీటిలో సందడి చేస్తూ కనిపిస్తాయని చెబుతున్నారు. ఈ శీతాకాల నేస్తాలకు కావలసిన అనువైన వాతావరణం కవ్వాల్ అభయారణ్యంలో ఉండడంతో పెద్ద ఎత్తున తరలి వచ్చే వివిధ జాతులకు చెందిన పక్షులను వీక్షించేందుకు ఎంతో మంది పక్షి ప్రేమికులు ఈ ప్రాంతానికి తరలివస్తారని అధికారులు చెబు తున్నారు.

కడెం ప్రాజెక్టులో జల విహారం

ఓవైపు సకల జాతులకు చెందిన జంతువులు, పక్షులతో పర్యాటకులను మంత్రముగ్ధుల్ని చేసే కవ్వాల్ అభయారణ్యంలో కడెం ప్రాజెక్టు సైతం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. చుట్టూ ఎత్తైన కొండలు పచ్చని చెట్ల నడుమ నిండుకుండలా దర్శనమిచ్చే కడెం ప్రాజెక్టులో తెలంగాణ ప్రభుత్వం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోటింగ్‌పై ఇటుగా వచ్చే ప్రయాణికులు ఎంతో మక్కువ చూపుతున్నారు. కడెం ప్రాజెక్టులో జల విహారం చేస్తూ ప్రాజెక్టు అందా లను వీక్షిస్తూ నిత్యం ఎందరో మంది సందడిగా గడుపుతున్నారు. పెద్ద పులుల సంరక్షణ కోసం అభివృద్ధి చేస్తున్న కవ్వాల్ అభయారణ్యం ఇటు చక్కటి ఏకో టూరిజం ప్రాంతంగా సైతం అభివృద్ధి చెందుతుండడంతో ప్రకృతి ప్రేమికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

భైంసాలో వైభవంగా దుర్గామాతల శోభాయాత్ర



భైంసా శోభాయాత్రలో పాల్గొన్న భక్తజనం



పద్మావతి కాలనీ మహిళల కోలాటాలు



బందోబస్తు పర్యవేక్షిస్తున్న ఎస్పీ జానకి షర్మిల

భైంసా, అక్టోబరు 13 :అశేష భక్తజన కోలాహలం, భారీపోలీసు బందోబస్తు మధ్య ఆదివారం భైంసాలో దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనోత్సవం వైభవోపేతంగా జరిగింది. కట్టుదిట్టమైన భద్రత చర్యలు, పటిష్టవంతమైన బందోబస్తు ఏర్పాట్ల మధ్య ఉన్నతాధికారు ల నిరంతర పర్యవేక్షణ వెరసి దేవి నవరాత్రి వేడు కలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఆదివారం ఉదయం వేళలో ప్రారంభమైన నిమజ్జనోత్సవ శోభా యాత్ర రాత్రి వరకు కన్నుల పండువగా కొనసాగింది. దుర్గాదేవి మండలిల సభ్యుల కోలాహలం మధ్య శోభాయాత్ర సందడిగా కొనసాగింది. మండలిల సభ్యులు శోభాయమానంగా అలంకరించిన వాహనాలలో దుర్గాదేవి విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ముథోల్ ఎమ్మెల్యే పవార్‌రామరావ్ పాటిల్, ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ అవినాష్ కుమార్, హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షులు పెండెపు కాశీనాథ్‌లు పురాణాబజార్ ప్రాంతంలోని యాదవసంఘం ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహం వద్ద, భవాని చౌక్ సార్వజనిక్ దుర్గామండలి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనోత్సవ శోభయాత్రను ప్రారంభించారు. శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాత నిమజ్జనోత్సవ శోభయాత్రలో పద్మావతి కాలనీలకు చెందిన మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. సంప్రదాయబద్ధంగా ఆధ్యాత్మిక గేయాలు ఆలాపిస్తూ, కోలాటాలు వేస్తూ, నృత్యాలు చేపడుతూ శోభాయాత్రకు వన్నె తెచ్చారు. భవానిచౌక్ సార్వజనిక్ దుర్గామండలి వారు నిమజ్జనోత్సవ శోభాయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇక్కడి మండలి వద్ద పోతరాజులు విన్యాసాలు తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. శోభాయాత్రలో మహిళలు అధికసంఖ్యలో వచ్చి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా కొనసాగిన విగ్రహాల శోభాయాత్ర గడ్డెన్న వాగుప్రాజెక్టు వద్ద ముగిసింది. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విగ్రహాలను గడ్డెన్నవాగు ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు.పట్టణ పరిధిలో జరిగిన దుర్గామాత నిమజ్జనోత్సవ శోభాయాత్రలో మహిళల కోలాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

భారీ పోలీసు బందోబస్తు

పట్టణంలో ఆదివారం నిర్వహించిన దుర్గాదేవి నిమజ్జనానికి ఎస్పీ జానకీ షర్మిల ఆధ్వర్యంలో భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, టౌన్ సీఐ గోపినాథ్‌లు కట్టుదిట్టమైన భద్రతాచర్యలు చేపట్టారు. భద్రతా చర్యల్లో భాగంగా పట్టణాన్ని 6 సెక్టార్లుగా విభజించి ప్రణాళికబద్ధమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయాలు, ప్రార్థన మందిరాలు, వివాదాస్పద, సమస్యాత్మక ప్రాంతాలు, ప్రధాన కూడలీల్లో 21 పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. నిమజ్జనోత్సం ప్రారంభమైన సమయం నుంచి ముగిసే వరకు 4 పెట్రోలింగ్ టీంలు, 5 ఫుట్ పెట్రోలింగ్ టీంలు భద్రతా చర్యలో పాల్గొన్నాయి. 12 పుషప్ టీంలు నిమజ్జనోత్సవ శోభాయాత్రలో పాల్గొన్నాయి. జిల్లా ఎస్పీ జానకీ షర్మిల భైంసాలో శోభాయాత్ర కొనసాగే మార్గాల్లో విస్తృత పర్యటనలు చేపట్టి బందోబస్తును పర్యవేక్షించింది. బందోబస్తులో ఇద్దరు డీఎస్పీలు, 6 మంది సీఐలు, 24 మంది ఎస్ఐలు, 240 మంది వరకు సివిల్ పోలీసులు, హోంగార్డులు , అర్మ్‌డ్ రిజర్వ్‌డ్ కానిస్టేబుల్లు, స్పెషల్ పార్టీ పోలీసులు, మహిళ పోలీసులతో పాటు , డాగ్ స్క్వాడ్ టీం,బాంబు డిస్పోజల్ టీం,వజ్ర వాహనం పాల్గొన్నాయి.

ఒమన్‌లో బతుకమ్మ సంబరాలు



బతుకమ్మలతో మహిళలు

ఖానాపూర్, అక్టోబరు 13 : ఒమన్‌దేశంలో ఇండియన్ సోషల్‌క్లబ్ ఒమన్ తెలంగాణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ మేరకు ఆదివారం ఖానాపూర్‌కు చెందిన ఒమన్ తెలంగాణ సమితి కన్వీనర్ గుండేటి గణేష్ ఆంధ్రజ్యోతికి ఫోన్ ద్వారా వివరాలు వెల్లడించారు. ఒమన్‌లోని ఆల్ అమల్ క్లబ్‌లో నిర్వహించిన ఈ వేడుకలకు ఒమన్‌లోని తెలంగాణ వాసులంతా పెద్దఎత్తున తరలివచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. తీరొక్క పూలను సేకరించి సిద్ధం చేసిన బతుకమ్మ వేడుకలకు మహిళలు పెద్దఎత్తున తరలివచ్చినట్లు పేర్కొన్నారు. తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టి పడేలా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆడపడుచుల ఆటపాటలతో పాటు చిన్నారుల నాట్య ప్రదర్శన ఆకట్టుకున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయాలను చాటి చెప్పేందుకు ఒమన్ తెలంగాణ సమితి ఆధ్వర్యంలో ప్రతి ఏడాది బతుకమ్మ సంబరాలను నిర్వహిస్తున్నట్లు గణేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ ఎంబసీ ఆఫ్ ఇండియా తవిశీ బేహాల్ పాండే, ఇండియన్ సోషల్‌క్లబ్ ఆఫ్ ఒమన్ చైర్మన్ బాబు రాజేంద్రన్, తలాల్ అమోద్ సలీం ఆల్ బుసైది, షకీల్, ఒమన్ తెలంగాణ సమితి కో-కన్వీనర్ నూనె లక్ష్మణ్, కోర్ కమిటీ, జాయింట్ కమిటీ సభ్యులున్నారు.

పత్తి కొనుగోలు ప్రారంభం



తూకానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కుభీర్, అక్టోబరు 13 : మండల కేంద్రం కుభీర్‌లోని నాగేష్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో శనివారం దసరా పండుగను పురస్కరించుకొని పత్తికొనుగోలును ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంటాలకు పూజలు చేసి పత్తి విక్రయించే మొదటి రైతుకు శాలువా పూలమాలతో సత్కరించారు. పత్తి క్వింటాలుకు రూ. 6,850 అందించారు. కార్యక్రమంలో సంతోష్‌సేట్, ఆనంద్‌సేట్, నాయకులు దత్తురాం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దసరా వేడుకలు



మహాలక్ష్మి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



ఆయుధ పూజ చేస్తున్న ఎస్పీ



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 13 : నిర్మల్ జిల్లా కేంద్రంలో విజయ దశమి దసరా పర్వదినాన్ని ప్రజలు అంగరంగ వైభవంగా ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు.

మహాలక్ష్మిని దర్శించుకున్న ఎమ్మెల్యే...

విజయదశమి పర్వదినం సందర్భంగా శనివా రం బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయంలో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. విశ్వహిందూ పరిషత్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయమే విజయదశమి అని పేర్కొన్నారు. ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, దేశం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. రావణ దహనం కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహాలక్ష్మి ఆలయంలో మాజీ మంత్రి పూజలు...

మహాలక్ష్మి ఆలయంలో విజయ దశమి సందర్భంగా మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రత్యేకపూజలు చేశారు. నాయకులు పాకాల రాంచందర్, ధర్మాజీ రాజేందర్ ఆయన వెంట ఉన్నారు. ప్రియదర్శినినగర్‌లోని అంజనేయ ఆలయంతో పాటు బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయంలో మున్సిపల్‌చైర్మన్ ఈశ్వర్ విజయ దశమి సందర్భంగా ప్రత్యేకపూజలు చేశారు. శమీ పూజ నిర్వహించారు. విజయ దశమి సందర్భంగా శనివారం జిల్లా ఎస్పీజానకి షర్మిల సాయుధ దళ కార్యాలయంలో ఆయుధపూజ నిర్వహించారు.

ఖానాపూర్ : దసరా పండగ ఎన్నటికైనా చెడుపై మంచి విజయం సాధిస్తుం దనడానికి ప్రతీకగా నిలుస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శనివారం రాత్రి ఖానాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు మంత్రరాజం సురేష్ అధ్యక్షతన నిర్వహించిన దసరా ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పలుచోట్ల నిర్వహించిన శమీ పూజకు బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి భూక్యా ఝాన్సీనాయక్ హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శెట్టి శ్యామ్‌మోహన్ రావు ఉన్నారు.

బాసరలో సినీ ప్రముఖుల పూజలు



మనవడికి అక్షర శ్రీకార పూజ జరిపిస్తున్న తనికెళ్లభరణి

బాసర, అక్టోబర్, 13 : బాసర పుణ్యక్షేత్రాన్ని ఆదివారం తెలుగు సినీ ప్రముఖులు సందర్శించారు. నటుడు రచయిత తనికెళ్ల భరణి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి సన్నిధిలో తమ మనువడు సర్వజ్ఞకు తనికెళ్ల భరణి అక్షర శ్రీకార పూజలు జరిపించారు. తానే స్వయంగా తన మనువడికి ఓనమాలు దిద్దించారు. ప్రముఖనిర్మాత దిల్‌రాజు సైతం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యే కపూజలు నిర్వహించారు.



అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ప్రముఖ నిర్మాత దిల్‌రాజు

ఘనంగా ఎల్లమ్మ జాతర

● దేవికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే

ముథోల్, అక్టోబరు 13: నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని కారేగాం గ్రామంలో దసరా నవరాత్రుల్లో భాగంగా రేణుకా ఎల్లమ్మ దేవి జాతర ఘనంగా నిర్వహించారు. గత తొమ్మిది రోజుల పాటు ఆలయంలో వేదపండితులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దసరా రోజు జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి సైతం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కోరిన కోరికలు తీర్చే ఇలవేల్పుగా అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ ఎల్లమ్మ దేవికి పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. అంతకు ముందు ఆలయం ఎదుట ఉన్న వాగుపై చిన్న బ్రిడ్జి కోసం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. తొమ్మిది రోజుల పాటు భక్తులకు నిర్వాహకులు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గిరిజన విద్యార్థికి ఎస్పీ ఆర్థిక సహాయం

ఉట్నూర్, అక్టోబరు 13: ఏజెన్సీలోని నార్నూర్ మండం మర్కగూడకు చెందిన పేద గిరిజన విద్యార్థి అశోక్ మెడిసన్ సీటు సాధించడంతో జిల్లా ఎస్పీ గౌస్ఆలం ఆర్థిక సహాయం అందించారు. పేద విద్యార్థి ఆర్థిక పరిస్థితులను గుర్తించిన ఎస్పీ ఉట్నూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గండికోట మొగిలి ఆధ్వర్యంలో అశోక్‌కు రూ.50 వేలు అందించారు. కార్యక్రమంలో జిల్లా మేడి మేస్రం దుర్గపాల్గొని జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

రిమ్స్‌లో ఆయుధ పూజలు

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 13: విజయదశమిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని రిమ్స్‌తోపాటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఆయుధ పూజ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్ పాల్గొని ఆపరేషన్ థియేటర్లలోని పరికరాలతోపాటు మిషన్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాహనాలకు పూజలు చేశారు. కార్యక్రమంలో రిమ్స్ వైద్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బంగల నాగాపూర్‌లో సోయాబీన్‌ల చోరీ

తాంసి, అక్టోబరు 13: మండలంలోని బండల నాగపూర్ గ్రామంలో గత మూడు రోజుల నుంచి సోయాబీన్‌ల దొంగతనం జరుగుతున్నట్లు రైతులు పేర్కొన్నారు. పంట పొలంలో సోయలను కోసి ఆరబెట్టి రాత్రి ఇంటికి వస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వీటిని దొంగిలిస్తున్నారని వివరించారు. పంట పొలానికి వెళ్లి చూసేసరికి క్వింటాళ్ల కొద్ది దొంగతనం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిని గ్రామానికి చెందిన వ్యక్తులే దొంగిలిస్తున్నారని తెలిపారు. శనివారం రాత్రి ఎల్మ రాకేష్ రెడ్డికి సంబంధించిన సోయాలను దొంగిలించారని పోలీసులకు ఫిర్యాదులు చేశారు.

బోథ్ ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

బోథ్, అక్టోబరు 13: మండలంలోని సోనాల గ్రామంలో రామాలయ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు శనివారం సాయంత్రం ముగిసాయి. ప్రతి రోజు శోభాయాత్ర కన్నుల పండుగగా జరపగా స్వామి వారిని మహిళలు మంగళ హారతులతో స్వాగతించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు గ్రామంలో అధ్యాత్మిక వాతావరణం నెలకొనడంతో పాటు పండుగ వాతావరణం కనిపించింది. చివరి రోజు రామాలయ కమిటీ చైర్మన్ జీ.వీ.రమణ ఆలయం వద్ద స్వామి వారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెట్ల పెళ్ళి సదా నందం, తుల అరుణ్‌కుమార్, బలి రామ్ జాదవ్, గుడిసెల రమణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం

బోథ్, అక్టోబరు 13: ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీలకమైందని సమాజాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుని పాత్ర ఎంతో కీలకమైంది అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలిరాం జాదవ్ పేర్కొన్నారు. ఆదవారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఇటీవల ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో కష్టపడి చదివి ఉపాధ్యాయులుగా ఎదిగిన వారు భావితరాలకుబాట చూపే వారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులులుగా ఎంపికైన వారి తల్లిదండ్రులతో పాటు పాఠశాల నిర్వాహకులు అల్లం సాయి కృష్ణ, ఆడెపు నరేష్, ఇసుకల కార్తీక్, రమణగౌడ్‌లున్నారు.

ఉద్యోగాలు సాధించిన యువకులకు సన్మానం

బోథ్, అక్టోబరు 13: ఎంతో కష్టపడి సాధించిన ఉద్యోగాలను సక్రమంగా నిర్వహించి ప్రజలలో పేరు సంపాదించుకోవాలని పూలే వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు గాజుల పోతన్న పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని సోనాల గ్రామంలో డీఎస్సీకి ఎంపికైన 9 మంది యువకులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 మంది సోనాల నుంచి ఎంపిక కావడం గర్వకారణంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూలే వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి రమేష్, సామాజిక కార్యకర్తలు, బీజేపీ నాయకులు సుభాష్, సూర్య, విశ్రాంతి ఉపాధ్యాయులు యోగానంద సరస్వతి, రమేష్, సాగర్, పంచాయితీ సెక్రటరీ భీమ్‌సింగ్, భోజారాజు, భూమా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మావలలో ..

మావల, అక్టోబరు 13: పట్టణంలోని రాంనగర్‌కు చెందిన అక్కాచెల్లెళ్ళు కుమ్ర సాయి ప్రియ, కుమ్ర వర్ణతేజలకు ఆదివారం పర్ధాన్ సమాజ్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. డిప్యూటీ తహసీల్దార్ కుమ్ర మధుకర్ కుమార్తెలైన సాయిప్రియ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కాగా, కుమ్ర వర్ణతేజ నీట్‌లో మంచి ర్యాంకు సాధించి రిమ్స్ ఆదిలాబాద్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది.

ఆయుధ పూజ చేసిన ఎస్పీ



గాల్లోకి కాల్పులు జరుపుతున్న జిల్లా ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, అక్టోబరు 13: ప్రజలు విజయదశమిని ప్రశాంత వాతావరణంలో జరుపుకుంటు సంస్కృతిని చాటాలని జిల్లా ఎస్పీ గౌస్ఆలం అన్నారు. శనివారం విజయ దశమిని పురస్కరించుకొని ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో ఆయుధ పూజ నిర్వహించారు. విజయానికి చిహ్నంగా గాల్లో ఐదు రౌండ్లను కాల్చి విజయదశమి వేడుకలను ప్రారంభించారు. అనంతరం సాయుధ పోలీసు విభాగంలో పనిచేస్తున్న డాగ్‌స్క్వాడ్, బాంబు స్క్వాడ్ టీం, పోలీసు వాహనాలకు సిబ్బందితో కలిసి పూజలు చేశారు.ఈ సందర్భంగా డాగ్ స్క్వాడ్ నుంచి గౌరవవందనం స్వీకరించారు. విజయ దశమి వేడుకలను జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సవాల నడుమ ప్రజలు జరుపుకోవాలని ఎస్పీ గౌస్ ఆలం కోరారు.పండుగల విశిష్టతను తెలియజేసేలా వేడుకలు నిర్వహిం చుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వర్టికల్ డీఎస్పీ పోతారంశ్రీనివాస్, ఆర్ఐలు వెంకటి, మురళి, చంద్రశేఖర్, ఆర్ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దసరా

బోథ్, అక్టోబరు 13: మండలంలోని దసరా పండుగ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. బోథ్ మండల కేంద్రంలో పండుగ వేడుకలను యువకులు, మహిళలు ఘనంగా జరుపుకోగా బోథ్‌లోని సాయిబాబా మందిరం నుంచి వెంకటేశ్వర స్వామి మందిరం వరకు ప్రజలతో కిటకిటలాడింది. ఆయా ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన ఎల్ఈడీ లైటింగ్, విద్యుద్దీకరణ ఆకట్టుకునేలా ఏర్పాటు చేయడం జరిగింది.

గుడిహత్నూర్: దసరా పండుగను పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. షమీ వృక్షానికి, ఆయుధాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జమ్మి పత్రిని ఒకరినొకరు ఇచ్చి పుచ్చుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నార్నూర్: ఆదివాసీ గిరిజన ప్రాంత నార్నూర్ గాదిగూడ మండలంలో శనివారం ఘనంగా దసరా పండుగలను దళిత గిరిజన ప్రజలు జరుపుకున్నారు. నార్నూర్ ఖాందేవునికి వంశీయులు తొడసం నాగోరావు మాజీ వైస్ చైర్మన్ ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ ఇతరులు తమ ఆరాధ్య దైవన్ని సాంప్రదాయబద్ధంగా మహాపూజ చేశారు. విజయ దశమి 68 దమ్మ చక్ర పరివర్తన దివాస్ సందర్భంగా గాదిగూడ మండలం మారేగావ్‌లో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ జిల్లా కమిటీ సభ్యులు అనిల్‌మోటేరావు బుదుని భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్ర పటాలు పూలమాల వేసి నివాళులర్పించి ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట పెందోర్‌సంతోష్, సిద్ధార్థ్ కోటంబే వాఘ్మారే, విలాస్, తదితరులున్నారు.

ఆదిలాబాద్ రూరల్: విధి నిర్వహణలో పోలీసులు చేస్తున్న సేవలు ఎంతో గొప్పవని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ పేర్కొన్నారు. శనివారం రాత్రి దసరా ఉత్సవాల అనంతరం దస్నాపూర్ మైదానంలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి ఆయన దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగావారికి బంగారం (జమ్మి ఆకు) సమర్పించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట బీజేపీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలోని ఆయా గ్రామాల్లో దసరా పండుగను ఘనంగా జరుపుకున్నారు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరు ఒకరికోకరు బంధు మిత్రులకు శ్రేయోభిలాషులకు రాజకీయ నాయకులకు, అధికారులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా గ్రామంలో గల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి తమ పాడి పంటలు చల్లగా ఉండాలనికోరుకున్నారు. మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఆలయం నుంచి గరుడ ఊరేగింపు నిర్వహించారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి, అక్టోబరు 13: దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఖానాపూన్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక రాధాకృష్ణ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధిని ఆకాంక్షించిన నియోజకవర్గ ప్రజలు తనను గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధికి పాటుపడుతున్నట్లు వివరించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సోమాసే వెంకట్‌రావు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, మాజీ వైస్ ఎంపీపీ పద్వాల్ గోపాల్‌సింగ్, సోమోరే నాగోరావు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతను దర్శించుకున్న ఎంపీ గోడం నగేష్

ఇంద్రవెల్లి, అక్టోబరు 13: దుర్గామాత అమ్మవారిని ఎంపీ గోడం నగేష్ దర్శించుకున్నారు. శనివారం మండలంలోని హర్కాపూర్ తండా గ్రామంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, బీజేపీ రాష్ట్ర నాయకులు రాథోడ్ రితేష్‌తో కలిసి దుర్గామాతను దర్శించుకున్నారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో ఎంపీకి శాలువాతో సన్మానించారు. అనంతరం ప్రధాన మంత్రి నరేంద్రమోది చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా దుర్గమ్మను దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయక్ చవాన్, ఉమాజీ నాయక్, బీజేపీ మండల అధ్యక్షుడు అరెల్లి రాజలింగు, ప్రధాన కార్యదర్శి రాథోడ్ భీంరావు, కనక తుకారం, తదితరులు పాల్గొన్నారు.

రూ.3 లక్షల తంబాకు ప్యాకెట్లు స్వాధీనం

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 13 : ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌లో రూ.3 లక్షల విలువ గల తంబాకు ప్యాకెట్లను రైల్వే అవుట్ పోస్ట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అహ్మదాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు రూ.3 లక్షల విలువ గల పార్సల్ ద్వారా వచ్చాయి. ప్రాథమికంగా దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపారు.

పారిశ్రామికంగా అభివృద్ధి యే లక్ష్యం : సీపీఎం

ఆదిలాబాద్ అర్బన్, అక్టోబరు 13: జిల్లాను పరిశ్రమ రంగంలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పార్టీ ఉద్యమిస్తు ముందుకు సాగుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. ఆదివారం సుందరయ్య భవనంలో పార్టీ పట్టణ కమిటీ 12వ మహాసభలను నిర్వహించారు. ముందుగా సీతారాం ఏచూరి, పుచ్చపల్లి సుందరయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ భవిష్యత్తు కార్యచరణ పై చర్చించారు.

ప్రజాసేవభవన్‌ను సందర్శించిన ఎమ్మెల్యే



ఎమ్మెల్యే గడ్డంవివేక్ వెంకటస్వామికి సన్మానిస్తున్న కంది

ఆదిలాబాద్ అర్బన్, అక్టోబరు 13: ఆదిలాబాద్ అభివృద్ధి కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఎస్సీ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన కాంగ్రెస్ పార్టీ అసెంబ్లి ఇన్‌చార్జీకంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామికి నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం కందిశ్రీనివాస్‌రెడ్డి చేస్తున్న కృషిని అభినందించారు. వెనుకబడిన ఆదిలాబాద్ అభివృద్ధి కోసం తన సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఇందులో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలున్నారు.

ఘన్‌పూర్ గ్రామాభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే

బోథ్, అక్టోబరు 13 : ఘన్‌పూర్ గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అందులో భాగంగానే హనుమాన్ ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు హైమాస్ లైట్లు ఏర్పాటు చేయించడం జరుగుతుందని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పేర్కొన్నారు. శనివారం రాత్రి గ్రామంలో దేవి నవరాత్రులు ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నవరాత్రుల సందర్భంగా భక్తి శ్రద్ధలతో కార్యక్రమాలను జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండేందుకు దేవి నవరాత్రులు ఉపకరిస్తాయని దురలవాట్లకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని కోరారు. అధ్యాత్మిక భావన మనిషి జీవితంలో అవసరమని అధ్యా త్మికతో మానసిక శాంతి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు అధ్యాత్మి కతతో మెలగాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొని ఎమ్మెల్యేను సన్మానించారు.

శోభాయాత్రను ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 13 : దసరా పండగను పురస్కరించుకొని ఆదిలాబాద్‌లో చేపట్టిన ఉత్సవానికి ఎంపీ నగేష్, ఇన్‌చార్జి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ గౌస్ ఆలం, ఎమ్మెల్యే పాయల్ శంకర్ శనివారం అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహించారు.

ఉత్సాహంగా విజయదశమి

నిర్మల్ అర్బన్ అక్టోబర్, 13 : పట్టణ శివారులోని గండి రామన్న క్షేత్రంలో శనివారం దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వ హించిన అనంతరం సాయిపల్లకి ఊరేగింపు కార్యక్రమాన్ని శోభా యమానంగా జరిపించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శమీ పూజ మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్ రెడ్డి, సభ్యులు ముత్యం, సంతోష్ గుప్తా, ఉప్పుల నందు, పూదరి నరహరి, శివ, పాల్గొన్నారు.

ముథోల్ : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు వివిధ గ్రామాల్లో విజయ దశమి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. విజయ దశమి వేడుకలను పురస్కరించుకుని కొత్త వస్త్రాలు ధరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పొలిమేరలోని జమ్మి చెట్టుకు బాజా భజంత్రీలతో ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం జమ్మి ఆకులను ఒకరికొకరు ఇచ్చి పండుగ శుభాకాం క్షలు తెలుపుకున్నారు. శాస్త్రోక్తంగా విజయ దశమిని పురస్క రించుకొని వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఆయుధ పూజ నిర్వహించారు. కుటుంబ పెద్దలకు జమ్మి ఆకు ఇచ్చి ఆశీర్వాదం తీసుకున్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా విజయ దశమి పం డుగ సందడి కనిపించింది.

సారంగాపూర్ : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శనివారం ఘనంగా విజయ దశమి వేడుకలను నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఉదయం ప్రతి ఒక్కరూ నూతన వస్త్రాలను ధరించి ఆలయాల్లో మొక్కులను మొక్కి ఒకరికొకరు విజయ దశమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దీంతో గ్రామాల్లో పండగ సందడి నెలకొంది.మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో దుర్గామాతలను నిమజ్జనం చేశారు. శనివారం దుర్గామాతలను రంగు రంగుల పూలతో అలంకరించి గ్రామాల్లోని వీధుల్లో డప్పు మేళాల మధ్య మహిళలు నృత్యాలను చేసుకుంటూ గ్రామాల సమీపంలో గల చెరువులలో దుర్గామాతలను నిమజ్జనం చేశారు

దిలావర్‌పూర్ : తొమ్మిది రోజులపాటు భక్తుల పూజలందుకున్న దుర్గాదేవి గంగమ్మ తల్లి ఒడికి చేరింది. అమ్మవారి మాలధారణ చేసి ఎంతో నియమ నిష్టలతో కొలిచిన భక్తులు అమ్మవారి నిమజ్జనోత్సవం అంగరంగ వైభవంగా నిర్వ హించారు. మండలంలోని ప్రతి గ్రామంలో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తి శ్రద్ధలతో పూజించారు. తొమ్మిది రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, అధ్యాత్మిక ప్రసంగాలు ఏర్పాటు చేశారు. నిమజ్జనోత్సవంలో భాగంగా శోభాయాత్ర నిర్వహిం చారు. ఆయా గ్రామాల్లో తొమ్మిది రోజులపాటు మాంసాహారాన్ని పూర్తిగా నిషేధించారు. మండలంలో విజయ దశమి వేడుకలను ఘనం గా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జమ్మి వృక్షానికి ప్రత్యేక పూజలు చేశారు. బంగారు (జమ్మి ఆకులు) పరస్పరం ఇచ్చి పుచ్చుకుంటూ శుభాకాంక్షలు తెలుపు కున్నారు. మండలంలో శరన్నవరాత్రి, దసరా వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి.

తానూర్ : మండల కేంద్రంతో పాటు మండలంలోని కోలూర్, దహగావ్, ఏల్వీ, భోల్సా, బేల్‌తరోడా, భోసి, ఝరీ(బి), ఆయా గ్రామాల్లో ఆదివారం నిమర్జన శోభయాత్ర భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆయా యువజన, కుల సంఘాల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవార్లకు నవరాత్రులో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి నిర్వాహకులు ఆదివారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసి వాహనాల్లో విగ్రహాలను ఉంచి, గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభయాత్ర నిర్వహించారు. భజనలు, కోలాటాల మధ్య నిమర్జన శోభయాత్రలు సాగాయి. అనంతరం అమ్మవారి విగ్రహాలను సమీప చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేశారు. ఎస్సై డి. రమేష్ ఆధ్వర్యంలోని పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

భైంసా రూరల్ : మండలంలోని కోతుల్‌గాం, బిజ్జూర్, వానల్‌పాడ్, ఖద్గాం, కామోల్ గ్రామాల్లో దుర్గామాత శోభా యాత్రను ఆదివారం ఘనంగా నిర్వహించారు. దుర్గాతకు తొమ్మిది రోజులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం దుర్గామాతను గ్రామాల్లోని వీధుల గుండా డప్పు బాజాలతో తిప్పుతూ ఆట పాటలతో కోలాటం చేస్తూ దుర్గాదేవిని గ్రామ సమీపంలో ఉన్న చెరువులో నిమజ్జనం చేశారు.

భైంసా : భక్తుల కోలాహలం మధ్య శనివారం దసరా సంబరాలు అంబరాన్నంటాయి. భైంసా డివిజన్ నిండా విజయదశమి శోభ తొణికిసలాడింది. ఊరూవాడా శమీపూజలు జరిగాయి. ఒకరినొకరు శమీని ఇచ్చి పుచ్చుకుంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. రావణుడి దిష్టిబొమ్మను దహనం చేశారు.

తీజ్ ఉత్సవాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక

● ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

కుంటాల, అక్టోబర్, 13 : గిరిజన సోదరులు ప్రతియేటా నిర్వహించే తీజ్ ఉత్సవాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని ముథోల్ ఎమ్మెల్యే రామ రావు పటేల్ అన్నారు. శనివారం కుంటాల మండ లంలోని అంబకంటి తండాలో నిర్వహిం చిన తీజ్ ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు తయారు చేసిన విత్తనాల మొలకలను ఎత్తుకొని పండగ ప్రాధాన్యత అడిగి తెలుసుకున్నారు. గిరిజన సోదరులు తీజ్ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకోవడం విశేషమ న్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజేష్ బాబు, మాజీ ఎంపీపీ అప్క గజ్జారాం, నాయకులు వెంగల్ రావు, మునీశ్వర్ రాజుతో పాటు పలువురు గిరిజన గ్రామాల ప్రజలు ఉన్నారు.

చెరువులో పడి ఒకరి మృతి

తానూర్, అక్టోబరు 13 : మండలంలోని దాండెపల్లి గ్రామంలో శనివారం కాలకృత్యాలకు వెళ్లినవాగ్మారే సాహెబ్‌రావు(40) కాలు జారి చెరువులో పడి మృతిచెందిన ఘటన చోటు చేసుకున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు. వివరాల ప్రకారం.. మండల కేంద్రం తానూర్‌కు చెందిన మృతుడు తన భార్యతో శనివారం పాటు మండలంలోని దాండేపల్లి గ్రామంలో గల భీముని మందిరానికి వెళ్లారు. మధ్యాహ్నం కాల కృత్యాల కోసం సాహెబ్‌రావు చెరువుకు వెళ్లగా ఎంతసేపటికి తిరిగి రాలేదు. దీంతో అనుమానం వచ్చిన భార్య అక్కడికి వెళ్లి చూడగా సాహెబ్‌రావు నీటిపై తేలుతూ కనిపించాడు. పలువురి సహాయంతో బయటకి తీసి చూడగా అప్పటికే ఆయన మృతిచెందాడు. ఈ మేరకు మృతుడి భార్యకల్పనబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి పడి మరొకరు..

సారంగాపూర్, అక్టోబరు 13 : మండలంలోని ఆలూర్ గ్రామానికి చెందిన దేశెట్టి రమేష్(42) అనే వ్యక్తి ప్రమాద వశాత్తు ట్రాక్టర్‌పై నుండి పడి మృతి చెం దినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీ సులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పంట పొలాల్లో ట్రాక్టర్‌తో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుండి జారిపడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా దమ్మచక్ర పరివర్తన్ దివాస్

భైంసా, అక్టోబరు 13: పట్టణంలో శనివారం 68వ దమ్మ చక్ర పరివర్తన్ దివాస్ వేడుకలు ఘనంగా జరిగాయి.ఉదయం వేళలో పట్టణంలోని అంబేద్కర్ విగ్రహాలకు దళిత సంఘాల ప్రతినిధులు , శ్రేణులు పూలమాలలు వేసి ఘనంగా నివాలులర్పించారు. స్థానిక బస్టాండ్ ఎదుట జరిగిన కార్యక్రమంలో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పాల్గొని బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వివిధ కాలనీల నుంచి గౌతం బుద్ధుని , భారత రత్న బీఆర్ అంబేద్కర్ చిత్ర పటాలను వాహనాల పై అందంగా అలంకరించి శోభాయాత్ర నిర్వహించారు.

ముథోల్: మండల కేంద్రమైన ముథోల్‌లో ఆదివారం దమ్మ చక్ర పరివర్తన దినోత్సవ వేడుకలను బౌద్ధులు, దళితులు ఘనంగా జరుపుకున్నారు. బౌద్ధ మతాన్ని స్వీకరించడాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం దమ్మ చక్ర పరివర్తన దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, దళిత సంఘం నాయకులు ఉపాసకులు, తదితరులు పాల్గొన్నారు.

తానూర్ : మండలంలోని ఆయా గ్రామాల్లో బుద్ధుని, అంబేద్కర్ చిత్రపటాలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బౌద్ధమహాసభ రాష్ట్ర నాయకులు సురేకాంత్ పవార్ మాట్లాడారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధమహాసభ నాయకులు వాగ్మారే గంగాధర్, భీమ్ పవార్, ఆనందర్‌రావు, గంగాధర్ భన్సుడే, తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని వెంకూర్ గ్రామంలో శనివారం దమ్మచక్ర పరివర్తన దినోత్సవాన్ని నిర్వహించారు. ధమ్మచక్ర పరివర్తన దినోత్సవం, అశోక విజయ దశమిని వెంకూర్ గ్రామంలో చేపట్టారు. అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మగ్గిడి దిగంబర్, అశోక్, సుధాకర్, గణేష్, పోతన్న, నారాయణ, రవి ప్రసాద్, గజానంద్‌తో పాటు గ్రామ మహిళలు ఉన్నారు.

పోగొట్టుకున్న బంగారు ఆభరణం అందజేత

ఖానాపూర్, అక్టోబరు 13 : తమకు దొరికిన బంగారు ఆభరణాన్ని తిరిగి బాధితులకు అప్పగించి హిందూ ఉత్సవ సమితి నాయకులు తమ నిజాయితీని చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే ఖానా పూర్‌లో శనివారం రాత్రి నిర్వహించిన దసరా ఉత్సవాలకు హాజరైన పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన గుమ్ముల అశోక్ రెండు తులాల బంగారు ఆభరణాన్ని పోగొట్టుకున్నాడు. ఉత్సవాలు ముగిసిన అనంతరం హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు మంత్రరాజం సురేష్, ప్రధాన కార్యదర్శి శెట్టి శ్యామ్, సభ్యులు తుమ్మనపల్లి లక్ష్మణ్, కృష్ణలకు రెండు తులాల బంగారు చైన్ కనిపించింది. దీంతో ఆభరణాన్ని తమ వద్ద ఉంచారు. శనివారం రాత్రి బంగారు చైన్ కోల్పోయిన గుమ్ము అశోక్ దసరా ఉత్సవాల్లో తన చైన్ పోయినట్లు కాలేరి దివాకర్ అనే యువకుడు హిందూ ఉత్సవ సమితి నాయకులకు తెలపడంతో ఆదివారం ఆ బంగారు ఆభరణాన్ని తిరిగి బాధితుడికి అప్పగించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



హాజరైన పూర్వ విద్యార్థులు

నర్సాపూర్(జి), అక్టోబరు 13 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1998-99 పదోతరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ స్నేహితులు ఒకే చోటికి చేరి గత జ్ఞాపకాలను నెమరువే సుకొని, తమ సంతోషాలను పంచుకున్నారు. అనంతరం పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఇందులో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలివెళ్లిన నాయకులు

కుంటాల, అక్టోబర్, 13 : ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఏర్పాటైన ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో ఆదివారం నిర్వహించనున్న మాలల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి కుంటాల మండలంతో పాటు ముథోల్ నియోజకవర్గం నుండి పలువురు తాలుకా సభ్యులు తరలివెళ్లారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టడం సరికాదని ఇప్పటికైనా వెనక్కి తీసుకోవాలని కోరారు. ఆదిలాబాద్‌లోని నిర్వహించనున్న సమావేశానికి తాలుకా అధ్యక్షులు శంకర్ చంద్రే, జిల్లా ఉపాధ్యక్షులు మగ్గిడి దిగంబర్, జనరల్ సెక్రటరీ విఠల్ కాంబ్లే, న్యాయవాదులు దేవిదాస్, గౌరవ అధ్యక్షులు గంగాధర్, కుంటాల మండల అధ్యక్షుడు సాయి, లోకేశ్వరం అధ్యక్షుడు అంజనేయులు, శివకుమార్, పోశెట్టి, ఉపాధ్యక్షులు ఉన్నారు.




జిల్ల ఆసుపత్రిలోని ఓపీ బ్లాక్ వద్ద రోగులు

పేరుకే.. పెద్దాసుపత్రి!



● ఉట్నూర్‌లో జిల్లా ఆసుపత్రి

- ఉట్నూర్‌లోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో నిపుణుల కరువు
- సిబ్బంది నియామకంలో సర్కారు విఫలం
- 2018లో కమ్యూనిటీ సివిల్ ఆసుపత్రిని జిల్లా కేంద్ర ఆసుపత్రిగా ప్రకటిస్తూ.. అప్పటి ప్రభుత్వం ఆదేశాలు
- అలంకారప్రాయంగా రక్త నిధి కేంద్రం
- అందుబాటులోకి రాని రేడియాలజిస్టు
- సరిపడా లేని డయాలసిస్ మిషన్‌లు
- ఆసుపత్రిలో మార్చురి గది లేకపోవడంతో ఆరు బయటే శవ పరీక్షలు
- ఏజెన్సీ ప్రాంత ప్రజలకు అందని సరైన వైద్య సేవలు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆదివాసీ గిరిజనుల ఆశలు



● ఆసుపత్రిలో వైద్యం అందుకుంటున్న రోగులు



ఉట్నూర్, అక్టోబరు 13: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి తీరు ఉంది. జిల్లా కేంద్రంలోని జిల్లా ఆసుపత్రిలో రాజీవ్‌గాంధీ కాలేజ్ ఏర్పాటు చేయడం వల్ల, అక్కడి జిల్లా ఆసుపత్రిని ఉట్నూర్ మండల కేంద్రంలోని కమ్యూనిటీ సివిల్ ఆసుపత్రికి తరలించి.. జిల్లా ఆసుపత్రిగా ఉట్నూర్ ఆసుపత్రిని ప్రభుత్వం ప్రకటించింది. జిల్లా ఆసుపత్రి హోదా కల్పించిన ప్రభుత్వం జిల్లా స్థాయిలోని సిబ్బందిని నియమించడంలో విఫలం కావడంతో ఉట్నూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి అవస్థల్లో కొట్టుమిట్టాడుతోంది. ఉట్నూర్‌లోని కమ్యూనిటీ సివిల్ ఆసుపత్రిని అప్పటి ప్రభుత్వం 2018లో జిల్లా కేంద్ర ఆసుపత్రిగా ప్రకటిస్తూ ఆదేశాలు జారీ చేసింది. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో వైద్య సేవలు అందించడానికి డాక్టర్లతో పాటు వైద్య సిబ్బంది వంద మంది వరకు అవసరం అవుతారు. కానీ ప్రస్తుతం జిల్లా ఆసుపత్రి ఏర్పాటు చేస్తున్నామంటూ ప్రకటించినా.. నేటికి కూడా కావల్సిన వైద్య సిబ్బందిని నియమించ లేదు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ స్థాయి సిబ్బందితో కాలం నెట్టుకొస్తున్నారు. ఫలితంగా ఏజెన్సీ ప్రాంతంలోని రోగులకు సక్రమంగా ఆశించే స్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. జిల్లా కేంద్ర ఆసుపత్రి మంజూరు అయితే రేడియోలాజిస్టు సేవలు అందుబాటులోకి వస్తాయని భావించింది. ప్రస్తుతం ఉన్న డయాలసిస్ కేంద్రంలో కేవలం ఐదు మిషన్‌లు ఉండడం వల్ల ఇతర ప్రాంతాలైన జన్నారం, దండెపల్లి, జైనూర్, సిర్పూర్, లింగాపూర్, కెరమెరి, నార్నూర్ గాదిగూడ మండలాల నుంచి వస్తున్న రోగులకు సక్రమంగా డయాలసిస్ సేవలు అందుబాటులో లేకుండా పోతున్నాయి. మరో ఐదు మిషన్లు పెంచితే ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు మెరుగైన డయాలసిస్ సేవలు అందుబాటులోకి వస్తాయంటున్నారు.

బ్లడ్ బ్యాంక్ సేవలు అంతంతే..

ఉట్నూర్‌లోని జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చెవి, ముక్కు, గొంతు చికిత్సలు అందజేయడంతో పాటు చర్మవ్యాధి నిపుణులు కూడా అవసరం ఉంది. ప్రస్తుతం ఉన్న బ్లడ్ బ్యాంకులో కాంపోనెంట్ సక్రమంగా లేకపోవడంతో ప్రజలకు బ్లడ్ బ్యాంక్ సేవలు అంతంత మాత్రమే అవుతున్నాయి. గత రెండేళ్ల క్రితం ఇక్కడ పని చేసిన డాక్టర్ భీమ్రావు రెగ్యులర్ ఉద్యోగం వచ్చి బజార్‌హత్నూర్ పీహెచ్‌సీకి బదిలీపై వెళ్లడంతో బ్లడ్ బ్యాంక్ సేవలు నిలిచి పోయాయి. జిల్లా ఆసుపత్రికి ప్రత్యేక మార్చురి గది లేకపోవడంతో ఆరు బయట శవ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా జనరేటర్ సౌకర్యం లేకపోవడంతో రాత్రి వేళల్లో రోగులు కరెంట్ అంతరాయం ఏర్పడినప్పుడు ఇబ్బందులు పడుతున్నారు. 120కేవీ జనరేటర్ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన ఉందంటున్నారు. ఆసుపత్రికి కావాల్సినంత డాక్టర్లు కూడా లేకపోవడంతో పాటు మత్తు డాక్టర్, ముగ్గురు సాధారణ ఫిజీషియన్లు అవసరం ఉంది. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న కొంతమంది డాక్టర్లకు పీజీ అవకాశాలు రావడంతో వారు వెళ్లిపోయారు. ఆసుపత్రిలో కంటి వైద్యం కోసం కావాల్సిన పరికరాలతో పాటు ఆపరేషన్ థియేటర్ ఎంతో అవసరం. ఇవేమీ లేకుండానే ఇద్దరు డాక్టర్లను నియమించడంతో వారు అసాధారణ వైద్య సేవలు అందిస్తున్నారు. ఇక్కడ ఉన్న ఆర్థో ఫిజీషియన్ జిల్లాకేంద్రంలోని రిమ్స్‌కు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బదిలీ కావడంతో ఉట్నూర్ ఆసుపత్రిలో ఎముకల డాక్టర్ కరువయ్యారు. అదేవిధంగా చిన్నపిల్లల వైద్యం అందించే డాక్టర్ సైతం లేకపోవడంతో పిల్లలకు వ్యాధులు సంక్రమించినప్పుడు ఈ ప్రాంత ప్రజలు ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల ప్రాంతాలకు వెళ్లి వైద్య సేవలు పొందుతున్నారు.

అప్పటి పాలకులు విఫలం

గత ప్రభుత్వంలో మంజూరైన మాతా శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్) భవనం నిర్మాణంలో అప్పటి బీఆర్ఎస్ పాలకులు విఫలమయ్యారు. అయితే ప్రస్తుతం ప్రజాపాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా ఈ భవన నిర్మాణం పూర్తి చేయాలని ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాల ప్రజలకు ఉట్నూర్ ఏజెన్సీ కేంద్రంలో ఉన్న ఆసుపత్రి పెద్దదిక్కు. ఏజెన్సీ ప్రాంతంలోని గర్భిణులకు చిన్నపిల్లలకు సరైన వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గర్భిణులకు మూడు నెలల నుంచి 9నెలల వరకు అందించాల్సిన పౌష్టిక ఆహారం కూడా సక్రమంగా అందడం లేదు. తద్వారా మహిళలు ప్రసవ సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. 2018లో రూ.17కోట్లతో మంజూరు చేసిన ఎంసీహెచ్ భవన నిర్మాణం పూర్తి చేసి ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి తేవాలని ఆదివాసీ గిరిజనులు కోరుతున్నారు.

డాక్టర్లను నియమించాలి

: దావులే బాలాజీ, మాజీ వైస్ ఎంపీపీ, ఉట్నూర్



ఉట్నూర్ జిల్లాఆసుపత్రికి కావాల్సిన వైద్య నిపుణులను, డాక్టర్లను ప్రభుత్వం వెంటనే నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. స్థానిక ఏజెన్సీ ప్రాంతంలోని రోగులందరూ వైద్యం కోసం ఉట్నూర్ వస్తున్నందున సత్వర వైద్యసేవలు అందుబాటులోకి తేవాలి.

కమిషనర్ దృష్టికి సమస్యలు

: డాక్టర్ జాదవ్ ఉపేందర్, ఆసుపత్రి సూపరింటెండెంట్, ఉట్నూర్



ఇటీవల ఉట్నూర్ ఆసుపత్రిని తనిఖీ చేసిన వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ దృష్టికి ఆసుపత్రి సమస్యలను తీసుకువెళ్లడం జరిగింది. అంతేకాకుండా కరెంట్ పోయినప్పుడు జనరేటర్ సౌకర్యం కావాలని, మార్చురి గది నిర్మించాలని, డాక్టర్‌ను నియమించాలని ఆయనను కోరడంతో.. ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొన్నారు.

ఘనంగా విజయదశమి వేడుకలు

● దస్నాపూర్‌లోని దసరా మైదానంలో రావణ దహనం ● శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు ● పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆదిలాబాద్ అర్బన్, అక్టోబరు 13: చెడుపై మంచి సాధించిన విజయాన్ని పురస్కరించుకుని దసరా పండుగను జరుపుకుంటామని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కన్యపరమేశ్వరి ఆలయం నుంచి దస్నాపూర్‌లోని దసరా మైదానం వరకు శోభాయాత్ర నిర్వహించారు. శనివారం రాత్రి దస్నాపూర్‌లోని దసరా మైదానంలో రావణ దహన కార్యక్రమం నిర్వహిచారు. ముందుగా హిందు ఉత్సవ సమితి ఆధ్వర్యంలో షమి పూజ నిర్వహించారు.అనంతరం పది తలల రావణుడిని ఆదిలాబాద్ ఇన్‌చార్జీ కలెక్టర్ వెంకటేశ్‌దోత్రే, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్, ఎస్పీ గౌస్‌ఆలం, గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి, ఉత్సవ సమితి సభ్యులు దహనం చేసి వేడుకలు నిర్వహించారు. ముందుగా సంప్రదాయ బద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సన్మార్గంలో నడవాలని జిల్లా ఇన్‌చార్జీ కలెక్టర్ అన్నారు. అనంతరం ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్‌లు మాట్లాడుతూ హిందూ దర్మం ఎంతో గొప్పదైందన్నారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా సన్మార్గంలో, భక్తి మార్గంలో నడవాలన్నారు. విజయదశమి వేడుకలను ఎందుకు జరుపుకుంటారో పండుగ ప్రత్యేక గురించి వివరించారు. ప్రతి ఒక్కరు భక్తి భావన చాటుకోవాలన్నారు. చెడుపై మంచి విజయం సాధించడం, పాండవులు యుద్ధానికి వెళ్లే ముందు జమ్మి చెట్టుపై ఆయుధాలు పెట్టి తర్వాత యుద్ధానికి వెళ్లి విజయం సాధించిందన్నారు. దీన్ని దసరా పండుగ జరుపుకుంటామని అన్నారు. ధర్మాన్ని రక్షించేలా ప్రతీఒక్క హిందువు ముందుకు రావాలన్నారు. నేడు ప్రపంచ దేశాలు హిందూ ధర్మంపై అధ్యయనం చేస్తున్నాయని తెలిపారు. ఇందులో హిందూ సమాజ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు హన్మండ్లు, కౌన్సిలర్‌లు, తదితరులు పాల్గొన్నారు.



దస్నాపూర్ దసరా మైదానంలో రావణ దహనం

● సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో..

జిల్లా విజయదశమి వేడుకలు అంబరాన్నంటాయి. పట్టణంలోని రాంలీలా మైదానంలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సనాతన హిందు ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. భక్తీ గీతాలను ఆలపిస్తూ బృంద సభ్యులు భక్తులను ఉత్సాహ పరిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముందుగా దేవతామూర్తుల చిత్రపటాలతో పాటు శమిఎట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రావణున్ని దహనం చేశారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ పట్టణ వాసులకు విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండుగ వేడుకలను అత్యంత వైభవోపేతంగా జరుపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ వేడుకల్లో సనాతన హిందు ఉత్సవమ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి,



శమీ పూజలు చేస్తున్న ఎంపీ నగేష్, ఎమ్మెల్యే శంకర్, యోగానంద సరస్వతి, హిందూ ఉత్సవ సమితి సభ్యులు

సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

● నేరడిగొండలో దసరా ఉత్సవాలు

నేరడిగొండ: మండలంలో శనివారం దసరా పండుగ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామ పొలిమేరలో గల జమ్మిచెట్టును పూజించి కొమ్మలను ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుంటూ.. పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే, బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ తన స్వగ్రామం రాజురాలో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఎస్సై శ్రీకాంత్ పోలీసు స్టేషన్‌లో ఆయన పూజ చేశారు. అంతేకాకుండా ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ నియోజకవర్గ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మండల కేంద్రంలో రావణ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● ఉట్నూర్‌లో దుర్గామాత, బతుకమ్మల నిమజ్జనం

ఉట్నూర్: ఉట్నూర్ ఏజెన్సీలో శనివారం విజయదశమి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్థానిక వినాయకచౌక్ నుంచి శోభాయాత్ర ద్వారా పాత ఉట్నూర్‌లోని రామాలయం వద్ద శమీ వృక్షానికి వేద పండితుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ హాజరై పూజలు నిర్వహించిన అనంతరం ప్రజలందరు శమి వృక్షం పైన ఉన్న ఆకులను తీసుకొని బంగారం లాగా భావిస్తూ ఒకరికొకరు అందించుకుని శుభాకాంక్షలు తెలుపుకుంటూ.. ఆలింగనాలు చేసుకున్నారు. ఇది ఇలా ఉండగ తొమ్మిది రోజులుగా పూజలు అందుకున్న దుర్గామాతలకు, బతుకమ్మలకు శుక్రవారం రాత్రి ఘనంగా నిమజ్జనం కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలో ప్రతిష్ఠించిన మొత్తం 18 మండపాలలోని దుర్గామాత విగ్రహాలకు సామూహిక శోభాయాత్ర ద్వారా బతుకమ్మల ఆట పాటలతో మహిళలు అంగరంగ వైభవంగా పట్టణంలోని వినాయకచౌక్ కూడలి వద్దకు చేరుకున్నారు. అక్కడే బొడ్డెమ బొడ్డెమ్మ ఉయ్యాలో అంటూ పాటలు పాడుతూ కోలాటాలు ఆడుతు భక్తి పారవశంతో అంగరంగ వైభవంగా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌తో పాటు హిందూ ఉత్సవ సమితి నాయకులు సుగుణ, చారులత, కొండేరి రమేష్, డాక్టర్ సాడిగే రాజగోపాల్‌లు హాజరయ్యారు. శాంతి భద్రతలు కాపడడానికి పోలీసులు గట్టి చర్యలు తీసుకున్నారు.



రావణుడికి పూజ చేస్తున్న యువకులు

తాంసి(కె)లో రావణ పూజ

భీంపూర్, అక్టోబరు 13: మండలంలోని తాంసి(కె) గ్రామంలో శనివారం విజయదశమి సందర్భంగా రావణ ఫ్లెక్సీని ఏర్పాటు చేసి స్థానిక యువకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివాసీ ప్రధాన్ కులస్తులు రావణుడిని దైవంగా కొలుస్తారని, రావణుడు తమ ఆరాధ్య దైవం అని వారు పేర్కొన్నారు. వారిలో లకన్, కన్నాకే దీపక్, మడవి విఠల్, కుర్సేంగే నారాయణ, నైతం పవన్, తదితరులు అన్నారు.

సాధ్యం కాని హామీలతో అధికారంలోకి కాంగ్రెస్ : జోగు

● 24న జిల్లాకు కేటీఆర్ రాక

ఆదిలాబాద్ అర్బన్, అక్టోబరు 13: అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుపై బీఆర్ఎస్ నిరంతరం ఉద్యమిస్తుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్న అన్నారు. కాంగ్రెస్ హామీలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలచేపట్టనున్నారు. ఇందులో భాగంగా ఈనెల 24న ఆదిలాబాద్‌కు రానున్న నేపథ్యంలో ఆదివారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మాట్లాడుతూ అధికారంలోకి రావడానికే కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ప్రకటించిందన్నారు. ఇందులో కేవలం ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఇతర వాటిని అమలు చేయడం లేదన్నారు. ఇందులో పార్టీ నాయకులు రమేష్, యూనిస్‌అక్బాని, అజయ్, రోకండ్ల రమేష్, గోవర్ధన్, మెట్టుప్రహ్లాద్, నారాయణ, సురేఖ, తదితరులు పాల్గొన్నారు.



క్యాంపు కార్యాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు దంపతులు



ఆయుధ పూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

మాలలు ఐక్యంగా హక్కుల సాధనకు ముందుకు సాగాలి

● చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

మావల, అక్టోబరు 13: మాలలు ఐక్యంగా ఉంటూ వారి హక్కు మాలలు ఐక్యంగా ఉంటూ వారి హక్కుతో పాటు ఇతర సమస్యల సాధనకు ముందుకు సాగాలని, తన అవసరం ఎక్కడున్న ముందు వరుసలో ఉంటానని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకట స్వామి అన్నారు. ఆదివారం పట్టణ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో మాల, మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆయనకు నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. అనంతరం పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీసారి రాజకీయంగా చర్చలు జరిగిన సమయంలో తెలంగాణ మాలల సంఖ్య తక్కువగా ఉందని చెబుతుంటారన్నారు. దీని కారణంగా వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదనే భావన ప్రతి పార్టీలో వచ్చిందన్నారు. ఇలా వచ్చిన ప్రతీసారి దాన్ని ప్రతిఘటిస్తూనే వస్తున్నారన్నారు. వర్గీకరణపై వచ్చిన సుప్రీం తీర్పులో దళితులపై ఉన్న వివక్ష కనిపించిందన్నారు. ప్రస్తుతం తెలంగాణలో 30లక్షల మంది మాలలు ఉన్నారన్నారు. అందరూ ఏకతాటిపై వచ్చి ఏ కార్యక్రమమైన జాతి కోసమేనన్న భావన వారిలో ఉండాలన్నారు. ఆ సమయంలో తన అవసర ముందనుకుంటే తాను ముందు వరుసలో ఉంటానని హామీనిచ్చారు. మాలల అభివృద్ధి, అభ్యున్నతికి తనవంతుగా పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్, సమాత సైనికల్ దళ్ అధ్యక్షుడు దిగంబర్, కన్వీనర్ నర్సయ్య, మాల సంఘం నాయకులు, ప్రతినిధులు కొప్పుల రమేష్, బేర దేవన్న, ప్రహ్లాద్, మేకల మల్లన్న, సూరం భగవండ్లు, కిరణ్‌కుమార్, సుధాకర్, ఏర సుధీర్, సోగాల సుదర్శన్, రత్న జాడే, ప్రజ్ఞాకుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాల ఆత్మీయ సమేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

● బొజ్జును కలుసుకున్న వివేక్

ఉట్నూర్: చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ ఆదివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్‌ను కలుసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమానికి వ ఎళ్తు ఎమ్మెల్యే బొజ్జు క్యాంపు కార్యాలయానికి రావడంతో బొజ్జు దంపతులు వివేక్ వెంకటస్వామికి పూలమొక్క అందించి శాలువాతో సన్మానించారు.

